# రంగా హత్య: దొంగ ఏడుపులు మానండి: నిజాలు మాట్లాడండి!



**రంగా హత్య జరిగి నెలరోజులు దాటింది. ఇకనైనా మనం అబద్ధపు ఏడుపులు మాని కొన్ని నిజాలు చెప్పుకోవాలి.**

**ఫ్యాక్టరీలలో కార్మిక పోరాటాలను విచ్ఛిన్నం చేయడానికి గుండాయిజం, గ్రామాలలో కూలి వాళ్లమీద గుండాయిజం, బంజరు దున్నే పేదలమీద పోలీసుల గుండాయిజం.**

రంగా హత్య జరిగి నెలరోజులు దాటింది. ఇకనైనా మనం అబద్ధపు ఏడుపులు మాని కొన్ని నిజాలు చెప్పుకోవాలి. అశాంతిని సృష్టించి శాంతికోసం ఊరేగింపులు తీసేవాళ్లు. కులతత్వాన్ని పెంచి పోషించి కులతత్వం ఎంత నీచం అని ఉపన్యాసాలు ఇచ్చేవాళ్లు. హత్యలు చేయించి హింసాకాండను గురించి ఆందోళన వెలిబుచ్చేవాళ్లు, గుండాలకు రాజకీయ నాయకులుగా ప్రమోషన్ ఇచ్చి రాజకీయాలలో గుండాయిజానికి స్థానం ఏమిటి అని ఆవేశంగా ప్రశ్నించేవాళ్లు — వీళ్లు పత్రికలనూ ప్రసరా సాధనాలనూ సమస్త వేదికలనూ అబద్ధాలతో కలుషితం చేస్తున్నారు. మనం ఇకనైనా నిజాన్ని గురించి కొంచెం వివరంగా మాట్లాడుకోవడం అవసరం. రాజ్యాంగంలోనూ ప్లానింగ్ కమిషన్ నివేదికలలోనూ ప్రొఫెసర్లు రాసే పుస్తకాలలోనూ చెప్పే సోషలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం అనే మార్మికతను పక్కకు పెట్టి వాస్తవాలను వాస్తవాలుగా చూడడం అవసరం.

ఈ నాలుగు దశాబ్దాలుగా మనం ప్రగతి ఏ మాత్రం సాధించ లేదంటే అది అబద్ధం అవుతుంది గానీ మనం సాధించిన 'ప్రగతి' చాలా వికృతమయినది. దేశంలో ఫ్యాక్టరీల కంటే సినిమాహాళ్లు ఎక్కువ, ఉత్పత్తి కంటే వర్తకం ఎక్కువ, గృహనిర్మాణం కంటే ప్లాట్ల వ్యాపారం ఎక్కువ, కార్మికుల కంటే బ్రోకర్లు ఎక్కువ, ఆస్పత్రుల కంటే సారాయి దుకాణాలు ఎక్కువ, ఒక్క మాటలో చెప్పాలంటే పనికొచ్చే పరిశ్రమ కంటే పనికిరానిదీ హానికర మయిందీ ఎక్కువ. సాంకేతిక పదజాలంలో చెప్పాలంటే దేశ ఆర్థిక రంగంలో ప్రాథమిక (వ్యవసాయ), ద్వితీయ (పారిశ్రామిక) రంగాలకంటే తృతీయ రంగం (వర్తక వాణిజ్యాలు, పాలన యంత్రాంగం) వేగంగా పెరుగుతోంది. అందులోనూ తెల్ల వ్యాపారం కంటే నల్ల వ్యాపారం వేగంగా పెరుగుతోంది. వర్తకంలో వుండే లాభం రేటు ఉత్పత్తి దాయకమయిన పరిశ్రమలో లేదు. నల్ల వ్యాపారంలో ఉన్నంత తెల్ల వ్యాపారంలో లేదు. భారతదేశం నలుమూలలా — పోర్బందర్ నుండి విజయవాడ దాక — వున్న అన్ని పట్టణాలలోనూ గుండా గ్యాంగులను ఈ రంగమే పోషిస్తోంది.

ఒక వైపు గ్రామీణ పేదలు పట్టణాలలోని మురికివాడలకి తరలిపోతుండగా, మరొక వైపు గ్రామీణ ధనిక వర్గం తాము కొత్తగా పొందిన సంపదను పట్టణాలలో అనేక రకాల నిరుపయోగమైన (చాలా వరకు హానికరమైన) వ్యవహారాలలోకి తరలిస్తున్నారు.

మన పట్టణాలన్నీ వికృతమయిన ఈ 'ప్రగతి' నుండి పుట్టినవే. మన రాజకీయ నాయకులూ దీనినుండి పుట్టిన వారే. అందుకే మన రాజకీయాలలో గుండాయిజం ముందునుండీ వుంది. మన పట్టణాలన్నీ గుండా గ్యాంగులకు నిలయంగా వున్నాయి. అయితే ఈ మధ్య కాలంలో ఒక చెప్పుకోదగ్గ మార్పు వస్తోంది. అదేమిటంటే అసలే వికృతమయిన మన ఆర్థిక వ్యవస్థలో ఇప్పుడు సంక్షోభం మరింత పెరగడంతో రాజకీయాలకు నిన్నటి దాకానే నేపథ్యంలోవున్న గుండాయిజం బరితెగించి ముందువరసలోవచ్చి కూర్చోవడం. ఒక్క రాజకీయాలలోనే కాదు. సమాజంలోని అన్ని రంగాలలోనూ — సాహిత్యం, సినిమా, జర్నలిజం — 'లంపెన్' సంస్కృతీ ప్రవృత్తులు ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటున్నాయి. వ్యవస్థలో సంక్షోభం ఎందుకు పెరుగుతోంది అన్న సిద్ధాంత చర్చను పక్కకు పెట్టి — అది సులభంగా తెగేది కాదు కాబట్టి పెరుగుతున్న సంక్షోభానికి గల సామాజిక పర్యవసానాన్ని పరిశీలిద్దాం అప్పుడు గుండాయిజం, కులతత్వం, ఎందుకు పెరుగుతున్నాయో కొంతయినా అర్థం చేసుకోగలుగుతాం.

ఈ పర్యవసానాన్ని రెండు రకాలుగా విభజించవచ్చును. ఒకటి, దేశపాలక వర్గాలు తమ మధ్యనున్న వైరుధ్యాలనూ విభేదాలనూ ఎంత మాత్రం సామరస్యంగా పరిష్కరించు కోలేక పోతున్నారు. ఆర్థిక రంగం అందరి ఆస్తులూ కోరినంత పెంచే విధంగా విస్తరిస్తూ వుంటే 'లివ్ అండ్ లెట్ లివ్' అనుకోగలరు గానీ, ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడి అది సాధ్యం కాకుండ పోయినప్పుడు పాలక వర్గాల అంతః కలహం కొట్లాట స్థాయికి దిగజారక తప్పదు.

ఒకరి మీద ఒకరు నిందలు వేసుకోవడం, ఒకరి గుట్టు ఒకరు బయట పెట్టుకోవడం, ఒకరి ఆస్తులొకరు ధ్వంసం చేసుకోవడం, ఒకరినొకరు చంపుకోవడం, చాలా ఎక్కువయి పోయింది. గ్రామాలలో పెత్తందార్లు, పట్టణాలలో వ్యాపారవర్గాలు, నగరాలలో బడా పారిశ్రామిక కుటుంబాలు, రాజకీయ పార్టీలు, పార్టీలలో 'అసమ్మతి వర్గ' ముఠాలు ఒకరి మీద ఒకరు 'మనసా వాచా కర్మణా' అన్నట్టు అన్ని రకాల దాడులకూ పాల్పడుతున్నారు.

రెండవది, పెరుగుతున్న సంక్షోభంతో బాటు ప్రజలమీద పాలకుల గుండాయిజం కూడ పెరుగుతోంది. ప్రజలను మభ్యపెట్టి, కొద్దిమందికి కొన్ని రాయితీలు ఇచ్చి తక్కిన వారికి భ్రమలు కల్పించి పరిపాలించే రోజులు పోయాయి. దానికి ప్రత్యామ్నాయం ఏమిటంటే సంస్కృతిలోనూ పాలనా యంత్రాంగంలోనూ ప్రజాస్వామిక విలువలను దిగజార్చడం, ప్రజలమీద భౌతిక దాడులకు పాల్పడడం. సాంస్కృతిక రంగంలో పెరుగుతున్న అశ్లీలానికీ రాజకీయాలలో పెరుగుతున్న గుండాయిజానికీ మూలం ఒకటే. ఫ్యాక్టరీలలో కార్మిక పోరాటాలను

విచ్ఛిన్నం చేయడానికి గుండాయిజం. గ్రామాలలో కూలివాళ్ల మీద గుండాయిజం, అలజడి చేసే ప్రజలమీద పోలీసుల గుండాయిజం, నిత్యకృత్యాలయ్యాయి.

ఈ రెండు పరిణామాలకూ కులం ఒక సాధనం అయింది. అందువల్లనే గుండాయిజంతో బాటు కులతత్వం కూడ సమాజంలో బాగా పెరిగిపోతోంది. ఒకరితో ఒకరు పోటీ పడడానికీ, పదవులూ ఆస్తులూ సంపాదించు కోవడానికీ, పాలక వర్గాలకు మంది బలం అవసరం. తమ వెంట జనాన్ని సమీకరించు కోవడం అవసరం. దీనికి డబ్బు ఒక ఖరీదయిన సాధనం కాగా, కులం ఖర్చులేని సాధనం. గ్రామీణ ప్రాంతాలలో పేదప్రజల మీద దాడులు చేయడానికి కూడా మంది బలం అవసరమే — ఏ వూళ్లోనయినా పెత్తందార్లు ఎంత మంది వుంటారు గనక! దీనికి కూడ డబ్బు ఒక సాధనమే. డబ్బిచ్చి గుండా గ్యాంగులను పోషించవచ్చును. అయితే అంతకంటే చవకయింది కులం. కులం పేరు చెప్పి సామాన్య రైతాంగాన్ని కూలివాళ్ల మీదికి ఎగదోయడం గ్రామీణ పెత్తందార్లు బాగా నేర్చుకున్నారు.

కులతత్వమూ అంతే. రాజకీయ తగాదాలలో కులాన్ని వాడుకోవడం, ఆస్తికోసం సంపద కోసం జరిగే కొట్లాటలలో కులాన్ని ఆశ్రయించడం, కూలి జనాన్ని చావగొట్టడానికి కులం పేరిట మందిని పోగు చేసుకోవడం, అన్నీ కూడ ముందు నుండి వున్నాయి గానీ ఈ సంక్షోభ సమయంలో పెరిగాయి. కారంచేడు, నీరుకొండ, బండ్లపల్లి, దొంతలి, గుడివాడ, కొల్లిపర తదితర గ్రామాలలో దళితుల మీద జరిగిన ప్రాణాంతకమయిన దాడులన్నీ ఈ కాలంలోనే జరిగాయి. రాజకీయ అధికారం కోసం జరిగే కుమ్ములాటలలో ఒకరి మీద ఒకరు 'కులతత్వం' అనే ఆరోపణ వేసుకోవడం కూడ బాగా పెరిగింది. కులాన్ని ఉపయోగించు కోవడమూ పెరిగింది. అయితే ఇదంతా కూడ ఆయా కులాలకు చెందిన ఉన్నత వర్గాలు తమ ఆస్తులూ అందుకోసం అధికారమూ — పెంచుకోవడానికి చేస్తున్న గోల అని మాత్రం చాలామంది అర్థం చేసుకోలేక పోతున్నారు. 'కులప్రయోజనం' అనేది ఒకటి ఉందనే భ్రమలో చాలామంది పడుతున్నారు. రంగా బతికివుంటే అతనివల్ల ఏ ప్రయోజనమూ పొంది వుండనివారు అతని హత్యను తమస్వంత విషయంగా భావించి ఆవేశానికి లోనయి ప్రాణాలు కోల్పోయారు, జైళ్ల పాలవుతున్నారు. తెలుగుదేశం పాలన వల్ల ఏ ప్రయోజనమూ పొందని సామాన్య రైతాంగం తమ కులానికి చెందిన పెత్తందార్ల మాటలు విని 'కాంగ్రెస్‌కు వోటు వేశార'నే కోపంతో అనేక గ్రామాలలో కూలి వాళ్ల మీద గొడ్డళ్ళతో బరిసెలతో దాడిచేశారు. జైలుపాలయి జీవితాలు నాశనం చేసుకున్నారు.

**కులం అనేది, ఉన్నత వర్గాలు తమ ఆస్తులూ అందుకోసం అధికారమూ పెంచుకోవడానికి చేస్తున్న గోల అని మాత్రం చాలా మంది అర్థం చేసుకోలేక పోతున్నారు.**

**రంగా బతికి వుంటే అతని వల్ల ఏ ప్రయోజనమూ పొందని వారు అతని హత్యను తమ స్వంత విషయంగా భావించి ఆవేశానికి లోనయి ప్రాణాలు కోల్పోయారు. జైళ్ల పాలవుతున్నారు. తెలుగుదేశం పాలనవల్ల ఏ ప్రయోజనమూ పొందని సామాన్య రైతాంగం తమ కులానికి చెందిన పెత్తందార్ల మాటలు విని 'కాంగ్రెస్‌కు ఓటు వేశార'నే కోపంతో అనేక గ్రామాలలో కూలివాళ్ల మీద గొడ్డళ్లతో బరిసెలతో దాడిచేశారు.**

మన రాష్ట్ర రాజకీయాలలో ఈ రెండు రకాల పరిణామాలూ తెలుగుదేశం పార్టీ పుట్టడంతో ఎక్కువయ్యాయి. అంటే అర్థం గుండాయిజం కులతత్వం తెలుగుదేశం పార్టీతో వచ్చాయని కాదు. ఏ సంక్షోభమయితే ఆర్థిక రాజకీయ రంగాలలో గుండాయిజాన్నీ కులతత్వాన్నీ పెంచిందో అదే సంక్షోభంలో భాగంగా తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. దీనివల్ల 'తప్పంతా ఎన్టీఆర్‌దే' అని కాంగ్రెస్ నాయకులు సులభంగా ఆరోపణ చేయగలుగుతున్నారు. ఆ తప్పు తలా పిడికెడు అందరికీ సమంగా చెందుతుంది.

మార్పులు మట్టుకు 1983 తరువాత త్వర త్వరగా రావడం మొదలు పెట్టాయి. గుండాముఠాలు రాజకీయ పార్టీలకు ఆలంబన అయ్యాయి. విజయవాడకు చెందిన ముఠానాయకులు మొక్కైరి ఎం.ఎల్.ఏ లయ్యారు. ఇతర ప్రాంతాల వారు మంత్రులూ అయ్యారు. అటుపైన వారి తగాదాలు వట్టి ముఠా తగాదాలుకావు. అవి 'రాజకీయ' తగాదాలు. వాటి పర్యవసానం గ్రామాలకు పట్టణాలకు పరిమితం కాదు. అది రాష్ట్ర వ్యాపితంగా, దేశవ్యాపితంగా, ప్రతిధ్వనిస్తుంది. వాటి ఫలితంగా ఆయా ముఠా సభ్యులు మాత్రమే నష్టపోరు. ప్రజలంతా నష్టపోతారు. నరసరావుపేట నియోజకవర్గం లోని నకిరికల్లు ఈ విషయాన్ని మొదట రుచి చూపించింది. ఇప్పుడు విజయవాడనాలుకకు వాతపెట్టింది. రేపు జమ్మల మడుగులోనూ పులివెందుల లోనూ జరగ కూడని దేదయినా జరిగితే ఇంకా ఏమేమి చూడవలసి వస్తుందో! గతంలో విజయవాడలో ఇవే ముఠాలకు చెందిన ప్రముఖ నాయకులు హత్య గావించ బడినప్పుడు ఇందులో శతాంశం కూడ గొడవ జరగలేదని గుర్తుంచుకుంటే, రాజకీయాల తెరవెనుకవున్న గుండాయిజం ముందుసీట్లో వచ్చి కూర్చుంటే ప్రజలకు జరిగేనష్ట ఎంతో అంచనా కొస్తుంది.

మనం బాధపడ వలసింది దీని గురించి గానీ బీసెంట్ రోడ్డు ఏల్మూరు రోడ్డు ధ్వంసం అయినాయని కాదు. మరొక సంవత్సరం తిరగక ముందే ఆ దుకాణాలన్నీ మ్రుటి శోభతో మెరుస్తుటాయి విజయవాడలోని వందల వేల కోట్ల రూపాయల ఆస్తి అంతా శ్రామిక జనం మూల్గులు పీల్చి సంపాదించింది. అందులో వెయ్యో వంతో వెయ్యిలో వెయ్యోవంతో బూడిద అయిందని ఏడవడానికి మనకు ఓపిక వుందిగానీ, కాల్పులలోనూ కొట్లాటలలోనూ పోయిన ప్రాణాల కోసం, వాటివల్ల చితికిపోయిన సామాన్య కుటుంబాల కోసం, ఏడ్చే వాళ్లు ఎవరూ లేరు. అధికారం కోసం ఆస్తి కోసం జరిగే తగాదాలలో జనం పావులయి తప్పుడు చైతన్యానికి బలయి పోతున్నారని బాధపడే వాళ్లులేరు. పాలక వర్గాలకు కావలసింది, ఇదే. 'కులపుయోగం' అనేది, ఒకటి వుందనే భ్రమలో జనం బతికినంత కాలం వాళ్ల ఆటలు యథేచ్ఛగా సాగుతాయి. జనం ఆ భ్రమ నుండి బయటపడ్డ నాడు ప్రస్తుత సంక్షోభానికి ప్రజాస్వామిక పరిష్కారం ప్రారంభ మవుతుంది.

కె. బాలగోపాల్

**పదవులూ ఆస్తులూ సంపాదించుకోవడానికీ, పాలక వర్గాలకు మంది బలం అవసరం. దీనికి డబ్బు ఒక ఖరీదయిన సాధనం, కులం ఖర్చులేని సాధనం.**